ప్రజాశక్తి
శుక్రవారం 30 జూన్ 2023 5 శ్రీ సత్యసాయి

శిక్షణ డీఎస్పీలతో మాట్లాడుతున్న డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి

వానా వానా.. ఎక్కడప్పా..!

◆ జూన్ నెల ముగుస్తున్నా పడని భారీ వర్షం

◆ ముందుకు సాగని వ్యవసాయం

◆ విత్తనాల ఏకాదశి వచ్చినా విత్తనం పడని పరిస్థితి

◆ పంట సాగుపై రైతుల్లో ఆందోళన

ఆ సారి ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు బాగా కురుస్తాయని, రుతుపవనాలు కూడా ముందుగానే వస్తాయని వాతవరణ శాస్త్రవేత్తలు చెప్పారు. రైతులు కూడా వర్షం, పంట సాగుపై ఆశలు పెట్టుకున్నారు. ఆ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. జూన్ నెల ముగిసినా ఇప్పటికీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెప్పకోదగ్గ పెద్ద వాన ఒక్కసారి కూడా పడలేదు. ఆరు మండలాలు మినహాయించి మిగిలిన చోట కనీసం భూమి తడిసేంత వాన కూడా లేదు. గత 10 రోజులుగా రోజూ ఆకాశం మేఘామృతం కావడం.. తరువాత గాలులు మొదలవడం.. వర్షం రాకుండా పోవడం జరుగుతోంది. ఖరీఫ్ పంట సాగుకు సమయం ముగిస్తున్నా చినుకు జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనలో పడ్డారు. వేసిన కొద్దిపాటి పంట కూడా వర్షం రాకపోవడంతో ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి-అనంతపురం

జూన్ 2వ వారం రాగానే రుతు పవనాలు ప్రవేశించి వర్షాలు పడుతాయి. ఈ ఏడాది మాత్రం ఆ పరిస్థితి లేదు. వానాకాలం ప్రారంభం అయ్యి నెల రోజులు పూర్తయినా ఇప్పటికీ చెప్పుకోదగ్గ వర్షం ఒక్క రోజు కూడా పడలేదు. గత వారం రోజులు వరకు కూడా ఎండవేడిమితో జనం ఇబ్బంది పడ్డారు. వారం రోజుల నుంచి రుతపవనాలు దోబూచులాడడం తప్పా చినుకు రూపంలో కిందకు దిగిందిలేదు. ఉమ్మడి జిల్లాలో ఈ పాటికే వేరుశనగ, కంది పంటల పనులు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే సరైన వర్షం లేకపోవడంతో పూర్తి స్థాయిలో వ్యవసాయ పనులు మొదలు కాలేదు. బోరుబావుల్లో నీరున్న రైతులు అడపాదడపా పంటలు సాగు చేస్తుండగా, వర్షాధార పంటల పనులు మాత్రం ఇప్పటికీ పూర్తి స్థాయిలో మొదలు కాని పరిస్థితి ఉంది. ముఖ్యంగా జిల్లా ప్రధాన పంట అయిన వేరుశనగ సాగు పూర్తిగా తగ్గింది. సాధారణ వర్షం పాతం నమోదు కావడంతో చాలా మంది వేరుశనగను వదిలేసి ఆముదం, పత్తి సాగు వైపు వెళ్తున్నారు. వీటికైతే వర్షం తక్కువగా ఉన్నా సరిపోతోందన్న భావన రైతుల్లో కన్పిస్తోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు వర్షాభావ పరిస్థితులలో ఉన్నాయి. గత వారం రోజుల క్రితం కదిరి, బత్తలపల్లి, ధర్మవరం, తాడిమర్రి తదితర మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. ఇది కూడా పంటలు సాగు చేసేందుకు అవసరం అయ్యే వర్షం కాదు. మిగిలిన మండలాల్లో ఈపాటి వర్షాలు కూడా ఇప్పటి వరకూ కురవలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరాసరి 5 సెంటీమీటర్లకు మించి వర్షపాతం నమోదవని పరిస్థితి ఉంది. గత వారంలో రుతపవనాలు ప్రవేశించాయని వర్షాలు బాగా కురుస్తాయని వాతవరణ శాఖ పేర్కొంది. అయితే రుతుపవనాలు ముందుకు కదలకపో వడంతో వర్షాలు కరవలేదు. ప్రస్తుతం రుతుపవనాలు వచ్చే అవకాశం కూడా కన్పించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పంట సాగుపై ఆందోళన

చినుకుజాడ లేకపోవడంతో పంట సాగుపై రైతుల్లో ఆందోళన కన్పిస్తోంది. ఇప్పటికే వరుస కరువులతో పంట నష్టాన్ని చవిచూసిన అన్నదాతలకు ఈ ఏడాది ఆదిలోనే వర్షాభావ పరిస్థితులు కన్పిస్తుండడంతో పంట సాగుపై ధైర్యం చేయలేకపోతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 9.31 లక్షల ఎకరాల్లో ఉంటుంది. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇందులో ఇరవై శాతం కూడా సాగవని పరిస్థితి ఉంది. అత్యధికంగా సాగయ్యే వేరుశనగ కూడా అంతంత మాత్రంగానే విత్తనం పడింది. రోహిణి, మృగశిర కార్తెలు ఇప్పటికే ముగిశాయి. మరికొద్ది రోజుల్లో ఆరుద్ర కార్తె కూడా పోతోంది. ఈ కార్తెల్లో విత్తనాలు వేస్తే పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావిస్తుంటారు. అలాంటిది వర్షం లేకపోవడంతో రైతులు విత్తనాలు వేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. వర్షం ఇలా దోబుచులాడుతున్న సమయంలో వేరుశనగ, కంది, తదితర పంటల విత్తనాలు వేయాలా.. వద్దా.. అన్న మీమాంశలో రైతులు ఉన్నారు. వర్షం మరికొంత ఆలస్యం అయితే చిరుధాన్యాల సాగు చేయడమే మేలన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. ఏది ఏమైనా ఈ వారం రోజుల్లో బలమైన వర్షం పడి పంట సాగు చేసుకునేందుకు వీలుకలుగుతుందనే ఆశతో రైతులు ఉన్నారు.

ప్రజలకు చేరువగా పోలీస్

◆ సత్వర న్యాయం అందించాలి

◆ అంకిత భావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు

◆ రాష్ట్ర డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రజలకు సత్వర న్యాయం అందించి వారికి పోలీసు సేవలను మరింత చేరువ చేసినప్పుడే పోలీసు శాఖపై నమ్మకం పెరుగుతుందని రాష్ట్ర డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ డీఎస్పీలతో గురువారం నాడు ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సమాజం, వత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎలా వ్యహరించలి.. ప్రజలకు అందించాల్సిన సేవలు.. విధినిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం, పారదర్శకత, క్రమశిక్షణ, మంచి ప్రవర్తన కలిగి ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. వత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు సత్వర న్యాయం చూపాలన్నారు. ఇటీవల పెరిగిపోతున్న సైబర్ నేరాల కట్టడికి కషి చేయాలన్నారు. ప్రజలు సైబర్ నేరస్తుల బారిన పడకుండా అవగాహన చేయడంతో పాటు వాటి నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. మహిళల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం, పోలీసుశాఖలు కషి చేస్తున్నాయని, ఆ దిశగా మహిళల రక్షణ కవచంగా దిశ యాప్ పని చేస్తోందన్నారు. దిశ కాల్స్‌కు సకాలంలో పోలీసులు సత్వరమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. నేరాలు జరుగకుండా ప్రివెన్సన్, డిటెక్సన్‌ల కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, చట్టాలను ఉపయోగించి నేరాలు తగ్గేందుకు కృషి జరగాలన్నారు. గంజాయి, తదితర మాదకద్రవ్యాల నియంత్రణపై ఇప్పటికే పోలీసు శాఖ ఉక్కుపాదం మోపిందన్నారు. మత్తుపదార్థాల అనర్థాలపైనా ప్రజల్లో అవగాహన తెస్తున్నామని చెప్పారు. ఇలాంటి పూర్తి స్థాయిలో నియంత్రణ జరిగేలా ఆ శాఖల పరిధిలో పోలీసులు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు వ్యక్తిగత విషయ పరిజ్ఞానంతో పాటు చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలకు సత్వర న్యాయం జరగడమే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహించాలని తెలియజేశారు. ఈ సమావేశంలో ఐజిపి వెంకట్రామిరెడ్డి అనంతపురం ప్రిన్సిపాల్ వి.గీతాదేవి, ఎస్పీ కె.శ్రీనివాసరావుతో పాటు ట్రైనీ డీఎస్పీలు పాల్గొన్నారు.

డిజిపితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనీ డీఎస్పీలు

'జనన్న సురక్ష' పేదలకు రక్ష

ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి -పెనుకొండ

'జననన్న సురక్ష' పేదలకు రక్ష అని ఎమ్మెల్యే శంకర నారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకొని, పరిష్కారం చూపేందుకే సీఎం జగన్ 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకా రం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంపై ఈ నెల 24వ తేదీ నుంచి వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తారన్నారు. జూలై 1వ తేదీ నుంచి 4 వారాల పాటు సచివాలయల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహించి 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తారన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు సామాజిక భద్రత కల్పిస్తోందని తెలిపారు. ఇప్పటికీ లబ్ధి పొందని వారిని గుర్తించి గౌరవప్రదమైన జీవితాన్ని ఇవ్వడమే లక్ష్యంగా వాలంటీర్లు, గృహ సారథులు, అధికారులు, నాయకులు పనిచేస్తున్నారన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

టిడిపిది తుస్సు యాత్ర : టిడిపి చేపట్టింది బస్సు యాత్ర కాదు.. తుస్సు యాత్ర అని ఎమ్మెల్యే శంకర నారాయణ ఎద్దేవా చేశారు. వారి కార్యకర్తల భవిష్యత్తుకే గ్యారెంటీ ఇవ్వలేని పార్టీ ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. గత టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి, జగన్ పరిపాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. 23 సీట్లకు పరిమితమైన టిడిపి ప్రజలను మోసం చేయడానికి మినీ మేనిఫెస్టో, పెద్ద మేనిఫెస్టో పేరుతో వస్తున్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

అనంతపురంలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఏకాదశి సందర్భంగా కదిరి లక్ష్మీ నరసింహస్వామి దర్శనార్థం క్యూలో నిల్చున్న భక్తులు

పండుగ శోభ

◆ ఉమ్మడి జిల్లాలో బక్రీద్, ఏకాదశి వేడుకలు

◆ ఈద్గాలు, ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు

ప్రజాశక్తి-అనంతపురం

బక్రీద్, ఏకాదశి పండుగలు ఒకేసారి రావడంతో ఉమ్మడి జిల్లాకు పండుగ శోభ సంతరించుకుంది. సాధారణంగా ముస్లిములు, హిందువులు జరుపుకునే పండుగలు వేరువేరు రోజుల్లో వస్తుంటాయి. ఈ ఏడాది మాత్రం బక్రీద్, ఏకాదశి ఒకేసారి రావడంతో అందరూ పండుగను చేసుకున్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఘనంగా వేడుకలను జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ రోజున ఇచ్చే ఖుర్బానీని ముస్లిములు పేదలకు అందజేశారు. ఇక ఏకాదశి పండుగను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తొలి ఏకాదశి కాకుండా విత్తనాల ఏకాదశి కావడంతో గ్రామాల్లో వేడుకలను సంబరంగా చేసుకున్నారు. కొన్ని గ్రామాల్లో ఏకాదశని పురస్కరించుకుని ప్రత్యేక జాతరలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

మూతబడిన ఎన్టీఆర్ శుద్ధ జల కేంద్రం

ప్రజాశక్తి-రొళ్ల

మండల పరిధిలోని దొడ్డేరి గ్రామ సచివాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ శుద్ధ జల కేంద్రం మూతపడింది. దీంతో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2014లో టిడిపి హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ శుద్ధ జల కేంద్రం ద్వారా రూ. 2కే 20లీటర్ల శుద్ధ జలాన్ని ప్రజలకు అందించేవారు. ప్రారంభంలో మిత్ర సంస్థ ఈ కేంద్రాన్ని నిర్వహించింది. తర్వాత గ్రామపంచాయతీ నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. అయితే ప్రభుత్వం నుంచి పంచాయతీలకు సక్రమంగా నిధులు అందకపోవడం, వచ్చిన నిధులను ఇతర వాటికి మళ్లించడంతో శుద్ధ జల కేంద్రం నిర్వహణ, మరమ్మతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ప్రజలు ప్రయివేట్ ట్యాంకర్ వద్ద రూ. 10 చెల్లించి శుద్ధ జలాన్ని కొనుగోలు చేస్తున్నారు. కొందరు కొళాయి నీటినే తాగుతున్నారు. ఇకనైనా అధికారులు శుద్ధ జల కేంద్రాన్ని తెరిపించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మూతబడిన ఎన్టీఆర్ శుద్ధ జల కేంద్రం

చంద్రబాబును కలిసిన కర్నూలు జిల్లా పరిశీలకులు

మడకశిర : కర్నూలు జిల్లా టిడిపి నాయకులు, కోడుమూరు నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి పార్టీ అధినేత చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని అధ్యక్షునికి వివరించారు. అలాగే టిడిపి మినీ మేనిఫెస్టోపై ప్రజల్లో మంచి స్పందన వస్తుందని తెలిపారు.

బాధితుడికి పరామర్శ

మడకశిర : పట్టణానికి చెందిన బోర్‌వెల్ ప్రభాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆయన హిందూపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా గురువారం వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బిఎల్ రామకృష్ణ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

ప్రమాదకరంగా కల్వర్టు

రొద్దం : మండల పరిధిలోని పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఆర్.కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు నెర్రెలు చీలి ప్రమాదకర స్థితికి చేరింది. ఐదేళ్ల క్రితం పెనుకొండ నుంచి కర్నాటక సరిహద్దు వరకు రెండు వరుసల రహదారి ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఈ కల్వర్టుని నిర్మించగా రోడ్డు మధ్యలో చీలికలు ఏర్పడుతున్నాయి. దీనికితోడు అక్కడే మలుపు ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనాదారులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నెర్రెలు చీలిన కల్వర్టు

అర్ధాంతరంగా ఆగిన 'ఎంజెపి' భవనాలు

ప్రజాశక్తి-మడకశిర

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశా లల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రజా ప్రతినిధులు, అధికారులు పేర్కొంటున్నా క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు పట్టణంలోని మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే(ఎంజెపి) పాఠశాల నిదర్శనం అని చెప్పవచ్చు. గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాల, కళాశాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా 90 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయడానికి అధికారులు నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ భవనాలు ఎక్కడిక క్కడే నిలిచిపోయాయి. దీంతో విధి లేని పరిస్థితిలో అధికారులు ఉన్న భవనాల్లోనే పాఠశాల, కళాశాల తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పాఠశాల తరగతులను మండల పరిధిలోని ఆర్.అనంతపురం హాస్టల్ భవనం, డిగ్రీ కళాశాల సమీపంలోని భవనాల్లో నిర్వహిస్తున్నారు. కళాశాల తరగతుల ను స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలోని భవనంలో నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రిన్సిపల్ మురళీధర్, అధ్యాపకుల కృషితో ఇంటర్‌లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిర్మాణ పనులు ఆగిన ఎంజెపి పాఠశాల భవనాలు

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్

టిడిపి నాయకులపై అక్రమ కేసులు సిగ్గుచేటు

ప్రజాశక్తి-కనగానపల్లి

మండలంలో ఇటీవల చేపట్టిన 'భవిష్యత్తుకు గ్యారెంటీ' బస్సు యాత్రకు ప్రజల నుంచి వచ్చిన స్పందనను చూసి ఓర్వలేక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించడం సిగ్గు చేటని రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, బిసి సెల్ రాష్ట్ర కార్య దర్శి నరసింహులు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ టిడిపి నాయకులపై పోలీసులు చేత అక్రమ కేసులు బనాయించడం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి దివాళా కోరుత నానికి నిదర్శనం అన్నారు. నాలుగేళ్లలో మండలంలోని ఏ గ్రామంలో నైనా ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేసి శిలాఫలకం ఏర్పాటు చేశారా అని ప్రశ్నించా రు. అభివృద్ధి చేస్తే ప్రజలు ఆదరిస్తార న్నారు. అంతేకానీ అక్రమ కేసులు పెడితే ప్రజలు కానీ, టిడిపి నాయకులు కానీ భయ పడరని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగభూషణం, సురేష్‌చౌదరి, సుబ్బయ్య, సుధాకర్, కాసుమూర్తి వెంకటేష్, బిల్లే దాము, చల్లా సోము, తిరుపాలు, సంజీవ్, శివానంద, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష ' సర్వేను సక్రమంగా నిర్వహించాలి

గోరంట్ల రూరల్ : గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి 'జగనన్న సురక్ష' సర్వేను సక్రమంగా నిర్వహించాలని డిఎల్‌డిఒ శివారెడ్డి ఆదేశించారు. మండల పరిధిలోని కమ్మవారిపల్లి, చుండూరువాండ్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వే కార్యక్రమా న్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అందించే ఉచిత సేవలు, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. అనంత రం కమ్మవారిపల్లి సచివాలయంలో ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తాతో కలిసి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష సర్వేలో పెండింగ్ ఉన్న వాటన్నింటినీ వంద శాతం పూర్తి చేయాలన్నా రు. జగనన్న సురక్ష క్యాంపు జరిగే రోజుకి ప్రజలకు అందించాల్సిన అన్ని సర్వీసులకు సంబంధించిన ధ్రువపత్రాల ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్మవారిపల్లి సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు

మడకశిర : పట్టణంలో వెలసిన షిరిడీ సాయిబాబా దేవాలయంలో జూలై 2వ తేదీ నుంచి నిర్వహించను న్న గురు పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అంశంపై గురువారం పట్టణంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి వేడుకల నిర్వహణపై చర్చించారు. అలాగే వివిధ పనులను కమిటీ సభ్యులకు అప్పగించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, అక్కంపల్లి బాబు, లక్ష్మీనారాయణ, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల రద్దు మూర్ఖపు చర్య

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

అన్న క్యాంటీన్లను రద్దు చేసి నిరుపేదల కడుపుకొట్టిన మూర్ఖపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్‌లోని అన్నా క్యాంటీన్ వద్ద గురువారం ఆమె సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ రూ. 2 కే కిలో బియ్యం పథకంతో పాటు పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆకలి తీర్చేందుకు చంద్రబాబు అన్నా క్యాంటీన్లను ప్రవేశపెడితే, సీఎం జగన్ వాటిని రద్దు చేసి పేదల కడుపు కొట్టాడన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సోము, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, త్రివేంద్రనాయుడు, బాబుల్‌రెడ్డి, ఐటిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి మంజునాథ్, బాలాజీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న సవితమ్మ

అన్నదానానికి విరాళం

కదిరి అర్బన్ : పట్టణంలోని కోనేరు కట్ట వద్ద ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో జులై మూడవ తేదీన జరిగే గురు పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, సీనియర్ నేత డాక్టర్ బత్తల వెంకటరమణ విరాళం అందజేశారు. ఈ మేరకు వారు రూ. 50వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దశరథ నాయుడు, పురుషోత్తం రెడ్డి, రామ్ కిషోర్ రెడ్డి, అంజి వాల్మీకి, కాయల జనార్దన్ నాయుడు, కొమ్ము విజయ భాస్కర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

గోరంట్ల : గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని గుమ్మయగారిపల్లిలో గురువారం జిల్లా ఎస్టీ ఉపాధ్యక్షు డు గంగాధర్, మండల సలహాదారుడు ఎల్ఎన్ నారాయణస్వామి ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి సుమతి, జిల్లా యూత్ అధ్యక్షులు వేణుగోపాల్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ సంక్షేమ వసతి గృహంలో ఏకలవ్య జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు సురేష్ మాట్లాడుతూ ఏకలవ్య జయంతి వేడుకలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎరుకుల జాతి సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు గజ్జల వెంకట రాముడు, కొమెరి శ్రీనివాసులు, నాయకులు దేవరకొండ ప్రసాద్, సాకే నరసింహులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

పుట్టపర్తి అర్బన్ : మున్సిపల్ అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన జరిగే అత్యవసర సమావేశానికి కౌన్సిలర్లు. సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

వైభవంగా అక్కమ్మగార్ల జాతర

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గుట్టకిందపల్లి వద్ద గురువారం అక్కమ్మగార్ల పరుష మహోత్సవాన్ని పూజారులు గుంజరమహేశ్, బయన్నల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కమ్మగార్లను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలోని 27,28 వ వార్డులలో రెండు వారాలుగా తాగునీటితో ఇబ్బందులుపడుతున్న విషయాన్ని స్థానిక టీడీపీ నాయకుల ద్వారా తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ సమస్యను పరిష్కరించారు. తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చారు.

ఘనంగా తొలి ఏకాదశి

బత్తలపల్లి : మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు విత్తన ఏకాదశి పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభించే ముందు రైతులకు తొలి పండుగ అయినందున రైతులు ఘనంగా జరుపుకున్నారు. బత్తలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని బత్తలపల్లి పొట్లమర్రి, గంటాపురం. రాదాపురం, మాల్యవంతం, ముష్టూరు, రాఘవంపల్లి, గుడులకుంట, సంఘమేశ్వరం, సంజీవపురం తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

కదిరి అర్బన్ : ఆషాడ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఖాద్రీ లక్ష్మి నరసింహ స్వామి సన్నిధికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుఝామున నుండి భక్తులు బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థము అతి శీఘ్రదర్శనము, ఉచిత దర్శనము క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం లో గురువారం తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు రాజేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, జింకారాజేంద్రప్రసాద్, చెన్నంశెట్టి శ్రీనివాసులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండల కేంద్రంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక చెరువులోని చుక్క వడియార్ దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం అక్కదేవతల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తచెరువు : మండల పరిధిలోని మీర్జాపురం పంచాయతీలోని పాత దేవరపల్లి గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా ఎద్దుల పండ్లు పరుగు పందెం పోటీలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం లక్ష్మీ చెన్నకేశవ దేవాలయంలో కళ్యాణోత్సవం వేడుకలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్నిరాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ఉపాధ్యక్షులు జివిఎల్. నరసింహులు విమర్శించారు. కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జిల్లా నాయకులు సాంబ శివ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను అమలు పర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల కాలంలో భవన నిర్మాణ కార్మికులకు ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు కాలేదని విమర్శించారు. కరోనా సమయంలో కాలంలో లక్షాలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.కార్మికుల కోసం వసూలు చేసిన సంక్షేమ బోర్డు నుండి 1150 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఈ నిధులను సంక్షేమ బోర్డుకు జమ చేసి రాష్ట్ర భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.కార్మికుల కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హెల్పర్ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు యధాతథంగా అమలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివిఎల్. నరసింహులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బి రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సాంబశివ, కార్మికులు రామాంజనేయులు, శీను, అంజినేయులు, క్రిష్ణప్ప, ఆదినారాయణ, లక్ష్మి నారాయణ, సిద్దయ్య బిమ్లానాయక్, సతీష్ కుమార్, సోము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

పుట్టపర్తిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

బత్తలపల్లి : మండల కేంద్రంలోని ఈదా మైదానంలో ముస్లిం సోదరులు బక్రీదు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముతవల్లిలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఎపి కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు ముస్లిం సోదరులకు ఈసందర్భంగా బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు.

కదిరి అర్బన్ : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో శాసనసభ్యులు డాక్టర్ పి వి సిద్దా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలో గురువారం. ఘనంగా బక్రీద్ వేడుకలు నిర్వహించారు. మండలంలోని గాండ్ల పెంట, రెక్క మాను, తాళ్ల కాలువ, కంపకంపల్లి, మల్ల మీద పల్లి, తూపల్లి తదితర గ్రామాల ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బుక్కపట్నం : బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పాముదుర్తి, గూనిపల్లి, కృష్ణాపురం తదితర గ్రామాల్లో బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఈద్గాలో ప్రత్యేక ప్రార్థన అనంతరం ముస్లిం మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో ముస్లిం యువత పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ఎస్ఐ నరసింహుడు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. నమాజ్ గుట్ట వద్ద ఉన్న ఈద్గా మైదానం, హాజరత్ మస్తాన్వలి దర్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. గురువారం పట్టణంలోని రెండు మసీదులలో ప్రార్థనల అనంతరం ర్యాలీగా ఇనుములపల్లి సర్కిల్లో గల ఈద్గాకు వెళ్లి అక్కడ ప్రార్థనలు చేశారు. పలువురు హిందువులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తదితరులు ముస్లిం సోదరులకు బ్రకీదు శుభాకాంక్షలు తెలిపారు.

అమరాపురం : మండలంలో ముస్లిములు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

హిందూపురం : ముస్లిం సోదరులు జరుపుకునే ముఖ్యమైన పండుగలలో బక్రీద్ పండుగ ఒకటని మౌలానా అబ్దుల్ మన్నన్ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు గురువారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మౌలానాలు పండుగ విశిష్టత గురించి వివరించారు. బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీరూపంగా నిలిచిందని మౌలానాలు తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు : బ క్రీ ద్ పండుగను పురస్కరించుకుని ప్రముఖులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, టిడిపి నాయకులు అమర్‌నాథ్, అంబికా లక్ష్మినారాయణ, గ్రీన్‌పార్క్ నాగరాజు, జెఇ వెంకటస్వామి, రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు బాలాజీ మనోహర్, వైసిపి నాయకులు నవీన్‌నిశ్చల్ ఇతర పార్టీలకు చెందిన ప్రముఖులతో పాటు జామీయ మసీదు కమిటీ ముత్వల్లీ నూరూల్లా, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సిఐలు ఈరన్న, మన్సూరుద్దీన్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓబులేసుని కొండ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

దాతలను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని జగరాజుపల్లి కొండపై ఉన్న ఓబులేశ్వరుని స్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ఓబులేసుని కొండను ఆయన గురువారం సందర్శించారు. కొండ క్రింది భాగాన నిర్మించ తలపెట్టిన కళ్యాణ మండపాన్ని పరిశీలించారు. అనంతరం కొండపైకి రహదారి ఏర్పాటు పనులను పరిశీలించారు. మట్టి రోడ్డు కోతకు గురైన కారణంగా ద్విచక్ర వాహనాల సైతం వెళ్లలేని పరిస్థితులలో ఉన్న పరిస్థితులను ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. గోరంట్ల– ధర్మవరం ప్రధాన రహదారి నుండి కొండ క్రింది భాగం వరకు తారు రోడ్డు నిర్మించి, అక్కడనుండి కొండ బాగాన సిసి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఓబులేశ్వర స్వామి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ గంగాధర, ఎంపీపీ రమణారెడ్డి, వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాల్ నాయక్, మండల కన్వీనర్ నరసారెడ్డి, జగరాజుపల్లి సర్పంచి మల్లిరెడ్డి, ఓబులేశ్వర స్వామి ట్రస్ట్ చైర్మన్ గోవిందప్ప, కమిటీ సభ్యులు మాజీ సర్పంచి సూర్యనారాయణ రెడ్డి, ఉమాపతి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు : మండల పరిధిలోని జగరాజుపల్లి ఓబులేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం భక్తులు భారీగా విరాళాలు ప్రకటించారు. తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా కొండపై వెలసిన ఓబులేసునికి గురువారం ఆలయ అర్చకులు ఘనంగా పూజలు నిర్వహించారు. మండల వాసులే కాక ఇతర మండలాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఓబులేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో కొండ క్రింది భాగాన అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొండకు వెళ్లి తిరిగి వచ్చిన భక్తుల ఈ అన్న ప్రసాదాలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఆలయ అభివృద్ధికి భారీగా విరాళాలు ప్రకటించారు. మాజీ సర్పంచి జగరాజుపల్లి ఆర్ సూర్యనారాయణ రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన సివిల్ ఇంజనీర్ శ్రీనివాసులు, కే ఓబులమ్మ, నిమ్మకాయల గోవిందప్ప, రిటైర్డ్ ఎస్ఐ వెంకట గారి పల్లి రాజేందర్ రెడ్డి, బత్తలపల్లి టీచర్ భగవతప్ప, ఎం నారాయణరెడ్డి, జి ఓబులేషు తదితరులు ఒక్కొక్కరు లక్ష రూపాయలు చొప్పున ఆలయ అభివృద్ధికి విరాళాలు ప్రకటించారు. అదేవిధంగా అమెరికలో నివాసం ఉంటున్న రమణమ్మ రూ. 50వేలు విరాళం ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కొండపైకి నీటి వసతి కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు గౌనికుంటపల్లి జనార్దన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కొండ క్రింది భాగంలో నిర్మించ తలపెట్టిన కళ్యాణ మండప నిర్మాణానికి భక్తాదులు సహకరించాలని వారు కోరారు.

నేరాలు ఘోరాలు

నకిలీ పోలీసులు అరెస్టు

లేపాక్షి : సెబ్ పోలీసులమని చెప్పి ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ గురువారం తెలిపారు. హిందూపురం పట్టణానికి చెందిన చరణ్, జ్యోతిష్ గతంలో ఎస్‌పిఓలుగా, హిందూపూర్ సెబ్ సిఐ వద్ద డ్రైవర్‌గా, ఇతర విధుల్లో పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు. వారు ఇటీవల మండల పరిధిలోని వడ్డిపల్లి గ్రామంలో సెబ్ పోలీసులమని చెప్పి వడ్డే జయ కీర్తి ఇంట్లో సోదాలు చేశారు. ఆ సమయంలో ఆ ఇంటిలో 4 మద్యం ప్యాకెట్లు లభించగా అతడిని బెదిరించి ఫోన్ ద్వారా రూ. 6 వేలు వేయించుకోవడంతో పాటు ఓ మహిళ వద్ద రూ. 3వేలు లాక్కోవడంతో బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి దర్యాప్తును ముమ్మరం చేసి కేసు నమోదు చేసిన కొన్ని గంటల్లోనే చరణ్, జ్యోతిష్ అలియాస్ సంజీవ్ అలియాస్ కళ్యాణ్‌లను అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి 2 సెల్‌ఫోన్లు, ఓ ద్విచక్ర వాహనం సీజ్ చేసి వారిని కోర్టుకు హాజరు పరిచారు. ఎవరైనా ఇలా బెదిరిస్తే వెంటనే డయల్ 100కు కానీ లేదా పోలీసులకు కానీ ఫోన్ చేయాలని ఎస్ఐ సూచించారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

బత్తలపల్లి : తాడిమర్రి గ్రామంలోని గొర్రెల కాపరికి చెందిన గొర్రెపిల్లలు కుక్కల దాడిలో మృతిచెందాయి. గ్రామంలోని గంగప్ప 35 గొర్రె పిల్లలను గూడులో ఉంచి పెద్ద గొర్లను బయటకి తీసుకెళ్లాడు. ఆసమయంలో కుక్కలు గూడులో ఉన్న గొర్రెపిల్లలపై దాడిచేసి చంపేశాయి. దీంతో తనకు దాదాపు మూడు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. పశువైద్యాధికారి స్వర్ణలత చనిపోయిన గొర్రె పిల్లలను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపి ఆర్థిక సాయం వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

కర్నాటక మద్యం పట్టివేత

రొద్దం : అందిన సమాచారం మేరకు దాడులు చేసి శ్యాపురం గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్న చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని న్యామద్దల గ్రామానికి చెందిన సిద్ధారెడ్డి కొడుకు నాగార్జునను అరెస్టు చేసి 768 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. అతడిని విచారించగా కర్నాటకలోని అప్పుసుపల్లి గ్రామంలో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ నుంచి మద్యం తరలిస్తున్నట్లు నిందితుడు తెలిపాడన్నారు. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని అతడితో పాటు ఆ బార్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలపారు. దాడుల్లో ఎస్ఐతో పాటు జమేదార్లు కాంతప్ప, నాగరాజు, పోలీసులు పోతన్న, శ్రవణ్, గోపాల్‌నాయక్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

బత్తలపల్లి : మండలంలోని డిచెర్లోపల్లి గ్రామానికి చెందిన బెస్త నారాయణ, బెస్త నరేష్ అనే తండ్రీకొడుకులు ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. గురువారం ధర్మవరం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో మతుల కుటుంబ సభ్యులకు రూ.50 వేల నగదును కేతిరెడ్డి సుప్రియ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చల్లాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

ముదిగుబ్బ : మానవహక్కులకు భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు బాసినేని వెంగమేష్ చౌదరి పేర్కొన్నారు. జాతీయ మానవ హక్కుల రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా తనను నియమించిన సందర్భంగా ముదిగుబ్బ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వెంగమేష్ చౌదరి మాట్లాడారు. మానవ హక్కులకు భంగం కలిగిస్తే బాధితులకు అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు కాగా ఈ నెల 25 వ తేదీన విజయవాడ లో జరిగిన ఎన్‌హెచ్ఆర్‌సి జాతీయ సదస్సులో తనను రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా తనను ఎంపిక చేసినట్లు చెప్పారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

ధర్మవరం టౌన్ : పట్టణంలో శాంతిభద్రతలపై ప్రత్యేకదృష్టి సారించాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ధర్మవరం డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా డివిజన్ పరిధిలోని సమస్యలపై డీఎస్పీతో ఆరా తీశారు. దీర్ఘకాలిక కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్, టూటౌన్ సిఐలు సుబ్రమణ్యం, రాజా తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో పవర్‌లూమ్స్ బంద్

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో జూలై 1వతేదీ నుండి 31వతేదీ వరకు పవర్‌లూమ్స్‌లో చీరల తయారీ బంద్ చేస్తున్నట్టు పవర్ లూమ్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్ పోలా వెంకటనారాయణ, జాయింట్ సెక్రటరీ పల్లా నవీన్‌కుమార్ తెలిపారు. పట్టణంలో చేనేత వ్యవస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించి ఈ నిర్ణయంతీసుకున్నట్టు తెలిపారు. అంతేకాకుండా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన సూచనల మేరకు పవర్ లూమ్స్ బంద్ చేస్తున్నామన్నారు. అలాగే ఇతర ప్రాంతాల నుండి పవర్లూమ్స్ చీరలు రాకుండా ఆపాలని వారు కోరారు.

కాల్పులు జరిపిన వారిని అరెస్టు చేయాలి

కొత్తచెరువు : భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులు చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు యూపీలోని భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్‌పై కాల్పులు జరగడానికి ముందే దళిత జర్నలిస్టులు గౌరీ లంకేష్‌ను, గోవిందును చంపిన వారిపై చర్యలు తీసుకొని ఉంటే నేడు ఇది జరిగేది కాదన్నారు. యుపి ముఖ్యమంత్రి యోగి తక్షణమే చర్యలు తీసుకొని నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

వైసిపి పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

కదిరి అర్బన్ : వైసిపి పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్ విమర్శించారు. జనసేన పార్టీ స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరిగ్గా తెలుగులో మాట్లాడలేని అసమర్థ ముఖ్యమంత్రి జగన్ పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. అధికార పార్టీకి చెందిన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా తమ అధినేత పవన్ కళ్యాణ్ పై విమర్శలు మాని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హితవు పలికారు.

ఘనంగా గణాంకాల దినోత్సవం

కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్ అక్రమ్, ప్రిన్సిపల్ ఫణి కుమార్, అధ్యాపకులు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో గురువారం గణాంకాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పణికుమార్, కళాశాల డైరెక్టర్ అక్రమ్ మాట్లాడుతూ గణాంకాల శాస్త్రంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాల జయంతి వేడుకలను జరుపుకోవడం ఆనందం ఉందన్నారు. జీవితంలో గణాంక శాస్త్రం యొక్క ప్రాముఖ్యతను డైరెక్టర్, ప్రిన్సిపల్ విద్యార్థులకు వివరించారు. అనంతరం గణాంకాల శాస్త్రంలో వంద మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ చాంద్‌బాషా, డైరెక్టర్లు, అధ్యాపకులు జితేంద్ర, చంద్రిక, కీర్తి ప్రియ, అల్తాఫ్ తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

హిందూపురం : బక్రీద్ పండుగను పురష్కరించుకుని గురువారం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో ఉమర్ ఫారూక్ ఖాన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువకులు కుల మతాలకు అతీతంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పట్టన సిఐలు ఈరన్న, మన్సూరుద్దీన్ మాట్లాడుతు త్యాగానికి ప్రతీకగా నిలచిన పండుగ రోజున అన్ని కులాల వారు ఐకమత్యంతో కలిసి ఇలా ముందుకు రావడం అభినందనీమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారందరికి మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందించారు.

రైతులకు 'వాల్టా' కష్టాలు

ప్రజాశక్తి - రొళ్ల

మండల పరిధిలోని రొళ్ల, దొడ్డేరి, కాకి, ఎం రాయపురం, బొమ్మగూడహళ్లి గ్రామపంచాయతీలలో బోర్ల తవ్వకాలను నిషేదించారు. ఈ గ్రామాలకు వాల్టా చట్టం కిందికి తీసుకువచ్చారు. అయితే మూడేళ్ల కురిసిన వర్షాలకు భూగర్భజలాలు పెరగడంతో ప్రభుత్వం నిషేధిత గ్రామాల జాబితాను కుదించింది. అయితే ఈ ఐదు గ్రామాల్లో యధావిధిగానే ఆంక్షలు కొనసాగుతున్నాయి. మూడేళ్లుగా విస్తారంగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు ఈ గ్రామాల్లో కూడా పెరిగాయి. ముఖ్యంగా రైతులు పంటలు విస్తారంగా సాగు చేయాలంటే తప్పనిసరిగా బోర్లు తవాల్సిందే. తవ్వించాలంటే ఈ వాల్ట చట్టం ఉన్న గ్రామాలలో అధికారుల అనుమతి తప్పనిసరి అయింది. ఒకవేళ తెలిసో తెలియకో బోర్లను తవ్వితే వాటిని అధికారులు సీజ్ చేస్తున్నారు. బోరుబావులు తవ్వుకున్న రైతులు విద్యుత్ కలెక్షన్లు తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. బోర్లు వేసిన రైతులు సర్వీస్ కోసం విద్యుత్ అధికారుల దగ్గరికి వెళితే వాటా చట్టం సర్టిఫికెట్లు తీసుకురావాలని కరాకండిగా చెబుతున్నారు. అధికారులను వాల్టా సర్టిఫికెట్లు అడిగితే ఇచ్చేందుకు అనుమతి లేదంటున్నారు. సంబంధిత ఉన్నత అధికారులు చొరవ తీసుకొని ఈ వాల్టా చట్టం పరిధిలోని గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించి వాల్టాచట్టాన్ని ఎత్తివేయాలని ఆయా గ్రామాలరైతులు కోరుతున్నారు.

భూగర్భజలాలు పెరిగాయి

మూడేళ్లుగా వర్షాలు విస్తారంగా కురిసాయి. దీంతో భూగర్భ జలాలు కూడా పెరిగాయి. కావున వాల్టాచట్టాన్ని ఎత్తివేయాలి.

ఈరన్న
రైతు, బంద్రేపల్లి

రైతులకు ఇబ్బందులు

ప్రభుత్వం ఈ వాల్టా చట్టాన్ని అమలు చేయడం మూలంగా ఎక్కువ ఇబ్బందిగా మారింది. వక్క, ఇతర పండ్ల తోటలను రక్షించుకోవాలంటే నీటి అవసరం ఎంతో ఉంది. రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని వాల్టా చట్టాన్ని తొలగించాలి.

బయన్న
రైతు ఎం రాయపురం

విద్యుత్ కనెక్షన్లు ఇవ్వటం లేదు

గతంలో భూగర్భ జలాలు అడుగంటాయని సర్వే నిర్వహించి ఈ ప్రాంతాన్ని డార్క్ ఏరియాగా తేల్చారు. దీంతో బోర్ల వేయడానికి, కరెంటు కలెక్షన్ తీసుకోవడానికి ఇబ్బందిగా మారింది. తమ గ్రామం వాల్టా చట్టం ఉన్నందున వీటికి అనుమతి ఇవ్వడానికి అధికారులు ముందుకు రావడం లేదు.

రామన్న
రైతు గొల్ల హట్టి

అధికారులు చొరవచూపాలి

వాల్టా చట్టం ఉన్న గ్రామాలలో ఎవరు బోర్ల తవ్వడానికి ముందుకు రావడం లేదు. దీంతో పాటు విద్యుత్ కలెక్షన్లు తీసుకోవడానికి ఎక్కువ ఇబ్బంది పడుతున్నాం. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని వాల్టా చట్టాన్ని ఎత్తివేయాలి.

గోవిందప్ప
రైతు రొళ్ల

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE : TADIPATRI
I.A.NO.290/2022 in O.S.No.146 /2022
BETWEEN:
V.హరినారాయణ ...వాది–అర్జీదారు
యెదరి
K.మానస ...ప్రదివాది–రెస్పాండెంటు
నోటీసు టు రెస్పాండెంటు
K.మానస W/o A.దిలీప్ కుమార్ D/o Late A.రేణుకాదేవి, R/o డోర్ నెం.5/765, పెనుకొండ రోడ్డు, కొత్తచెరువు గ్రామం మరియు మండలము. అనంతపురం జిల్లా. ప్రస్తుతము శ్రీ సత్యసాయి జిల్లా.
సదరు నెంబరులో వాది–అర్జీదారుడు, లేటు A.రేణుకాదేవి గారు Earned Leave ముందస్తు జప్తు చేయుటకు నీవు, ఆమె వారసురాలు అయినందు వలన నీ మీద అర్జీదాఖలు చేసియున్నారు. నీ హాజరు నిమిత్తము 12/07/2023వ తేదిన వాయిదా వున్నది. ఆ రోజు పగలు 10:30 గంటలకు స్వతహాగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై కోర్టు వారికి ఏమైనా అక్షేపణలున్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల కోర్టు వారు నీ పరోక్షమందు తీర్మానము చేయుదురు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిద 12/07/2023
O.SUBBA RANGAIAH, J.CHAKRAPANI
ADVOCATES, TADIPATRI.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: TADIPATRI
O.S.No.146 /2022
BETWEEN:
V.హరినారాయణ ...వాది
యెదరి
K.మానస ...ప్రదివాది
నోటీసు టు డిఫెండెంటు
K.మానస W/o A.దిలీప్ కుమార్ D/o Late A.రేణుకాదేవి, R/o డోర్ నెం.5/765, పెనుకొండ రోడ్డు, కొత్తచెరువు గ్రామం మరియు మండలము. అనంతపురం జిల్లా. ప్రస్తుతము శ్రీ సత్యసాయి జిల్లా.
సదరు నెంబరులో వాది లేటు A.రేణుకాదేవి వ్రాసి యిచ్చిన ప్రాంసరీ నోటు బాకీ రాబట్టు నిమ్మిత్తము నీవు ఆమె వారసురాలు అయినందు వలన నీ మీద దావా దాఖలు చేసినందు వలన నీ హాజరు నిమిత్తము 12/07/2023వ తేదిన వాయిదా వున్నది. ఆ రోజు పగలు 10:30 గంటలకు స్వతహాగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై కోర్టు వారికి ఏమైనా అక్షేపణలున్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల కోర్టు వారు నీ పరోక్షమందు తీర్మానము చేయుదురు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిద 12/07/2023
O.SUBBA RANGAIAH, J.CHAKRAPANI
ADVOCATES, TADIPATRI.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి,కదిరి
O.S.NO:681/2019
Between:
ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, Kadiri Main Branch వారు rep by its senior manager. Kadiri.
...Plaintiff
మరియు
D1: షేక్ జబీవుల్లా S/o హైదర్ వలి, Residing at D.No:8-261, షహామీరియా స్ట్రీట్, కదిరి టౌన్ మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.
D2: షేక్ షామీర్ బాషా S/o మాబు సాహేబ్, R/at D.No:10-1098-182, నిజాంవలి కాలనీ, కదిరి టౌన్ మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.
...Defendants
పై దావాలోని D1 మరియు D2 ప్రతివాదులకి దావా సమన్లు
పై దావాలోని వాది (ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు Kadiri Main Branch వారు) ప్రతివాదులు D1 మరియు D2 అయిన మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 10/07/2023 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు 10/07/2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై అక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 10/07/2023
జి.గురులింగస్వామి,బి.ఎ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి,కదిరి
O.S.NO:655/2019
Between:
ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, Nallamada Branch వారు rep by its senior manager. Nallamada,
...Plaintiff
మరియు
D1: బొగ్గు రత్నమ్మ W/o శ్రీరాములు, R/at Near బస్సు స్టాండ్, నల్లమాడ గ్రామము మరియు నల్లమాడ మండలము శ్రీ సత్యసాయి జిల్లా.
...Defendants
పై దావాలోని D1 ప్రతివాదికి దావా సమన్లు
పై దావాలోని వాది (ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు Nallamada Branch వారు) ప్రతివాదులు D1 అయిన మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 06/07/2023 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు 06/07/2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై అక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా: 06/07/2023
జి.గురులింగస్వామి,బి.ఎ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి